


మల్లతహళ్లి చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ పరమశివుడి విగ్రహం

కెఆర్ రోడ్డులో..

శంభో..శంకర..!

● వాడవాడలా మార్మోగిన ఓంకారనాదం ● శివరాత్రి వేడుకలతో ఆలయాలు కిటకిట ● ధర్మస్థళకు పోటెత్తిన భక్తులు

బెంగళూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాల్లో శంభోశంకర నినాదాలు మార్మోగాయి. అభిషేకాలు, అర్చనలతో భక్తులు పరమశివుడిని దర్శించుకుని పులకించిపోయారు. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిట లాడాయి. బెంగళూరు నగరంలో పురాతనమైన గవిగంగాధరేశ్వర ఆలయంలో బుధవారం తెల్లవారుజామునుంచే భక్తుల సందర్శన ప్రారంభమైంది. ప్రతి ఆలయంలో పరమేశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తుల దర్శనానికి బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. మల్లేశ్వరంలోని కాడుమల్లేశ్వర ఆలయంలో భారీ శివలింగానికి పుష్పాలతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణ అనిపించింది. కాగా మల్లేశ్వరంలోని దక్షిణముఖ నందితీర్థ ఆలయంలో విశేష పూజలు సాగాయి. చామరాజపేటలోని మలెమహదేశ్వర ఆలయానికి తెల్లవారు నుంచి రాత్రిదాకా భక్తులు పోటెత్తారు. హెచ్ఏఎల్‌రోడ్డులోని శివోహం ఆలయంలో భక్తులు స్వయంగా క్షీరాభిషేకం చేశారు. సంగీత కార్యక్రమాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. హెచ్ఏఎల్ మూడోస్టేజ్‌లోని పూర్ణప్రజ్ఞ మైదానంలో మహాలింగేశ్వర సేవా ట్రస్టు ఐదో వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రయాగరాజ్‌లోని త్రివేణిసంగమం నుంచి తీసుకొచ్చిన జలాలతో భక్తులకు ప్రోక్షణ చేశారు. పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ట్రస్టీ బెళ్ళిపాడి గుణరంజన్‌శెట్టి పర్యవేక్షించారు. మల్లతహళ్ళి చెరువు ప్రాంతంలో పరమశివుడి భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి సందర్శనకు వీలు కల్పించారు. పలు చోట్ల ప్రసాదంగా అటుకులు పంపిణీ చేయగా కొన్ని చోట్ల ఎండవేడిమి నుంచి ఉపశమనం కల్పించేలా కీర దోస, పుచ్చకాయ ఇతర పండ్లను పంపిణీ చేశారు.





భక్తురాలి ప్రార్థన

యశ్వంతపుర గాయత్రీమాత ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



మలెమహదేశ్వరుడి ఆలయం కిటకిట..

చామరాజనగర జిల్లాలోని మలెమహదేశ్వర కొండలపై వెలసిన మలె మహదేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలనుంచి పాదయాత్రగా చేరుకున్నారు. ఏటా శివరాత్రిన ఇక్కడ జాతర కొనసాగుతుంది. ఇలా కర్ణాటకతో పాటు తమిళనాడు, కేరళకు చెందిన భక్తులు వచ్చారు. ఉదయం నుంచే భారీస్థాయిలో భక్తులు తరలిరావడంతో ఆలయ కమిటీతోపాటు పోలీసు యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. ఇక మైసూరులోని నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయంలోనూ విశేష పూజలు కొనసాగాయి. శ్రీకంఠేశ్వరుడిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మైసూరులోని అంబావిలాస్ ప్యాలెస్ ఎదురుగా ఉండే త్రినేశ్వరస్వామికి 11 కేజీల బంగారు ముఖావళి ధరింపచేశారు. భక్తులకు ప్రత్యేకమైన దర్శనభాగ్యం కల్పించారు. మైసూరు సంస్థానం రణధీర కంఠీరవ నరసరాజ్ ఒడెయార్, ఒకటో దేవరాజ్ ఒడెయార్ ఆలయాన్ని నిర్మింపచేశారు. 1753లో ఇక్కడ ఆలయాన్ని నిర్మించారు.



మల్లేశ్వరంలోని దక్షిణముఖ నందితీర్థ ఆలయంలో భక్తుల పూజలు



గవిగంగాధరేశ్వర ఆలయంలో భక్తుల క్యూ

గంటల తరబడి క్యూ లైన్లలోనే..

దక్షిణకన్నడ జిల్లాలో ప్రముఖమైన ధర్మస్థళలోని మంజునాథస్వామి దర్శనం కోసం భక్తులు భారీగా వచ్చారు. నేత్రావతి నదిలో స్నానం చేసి మంజునాథస్వామిని దర్శించుకున్నారు. భక్తులకోసం ఏర్పాటు చేసిన షెడ్‌లలో గంటలతరబడి వేచి యుండే పరిస్థితి నెలకొంది. ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఇక ఉత్తరకన్నడ జిల్లా సముద్ర తీరంలోని మురుడేశ్వర ఆలయానికి స్థానికులే కాకుండా గోవాకు చెందిన భక్తులు సైతం తరలివచ్చారు. ఇదే జిల్లాలోని అతి ప్రాచీనమైన గోకర్ణ ఆలయంలో శివలింగాన్ని తాకేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. చిక్కబళ్లాపుర పరిధిలోని ఇషా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఆదియోగి శివుడిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. నంది కొండలలోని భోగనందీశ్వర ఆలయంలో పూజలకు భక్తులు తరలివచ్చారు. అయితే నందికొండలవైపు వెళ్లేందుకు నిషేధించారు. రాష్ట్రమంతటా ప్రతి గ్రామంలోనూ శైవక్షేత్రాలకు భక్తులు పూజల్లో పాల్గొన్నారు.



కాడుమల్లేశ్వర ఆలయంలోని భారీ శివలింగం



శివోహం ఆలయంలో..



కాడుమల్లేశ్వర మూలవిరాట్టు



జేపీ నగర్ మంజునాథస్వామి



శివబాలయోగి ఆశ్రమంలో క్షీరాభిషేకం

కోలారు కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

● జనపర ఉత్సవాలకు ఆహ్వానించలేదని మంత్రి బైరతి సురేష్‌పై ఎమ్మెల్యే రూపకళ ఆగ్రహం

బెంగళూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా కాంగ్రెస్‌లో విభేదాలు భగ్గుమన్నాయి. కేజీఎఫ్ ఎమ్మెల్యే రూపకళ శశిధర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేశ్ తీరుపట్ల మండిపడ్డారు. కోలారులో జరిగిన రాష్ట్రస్థాయి జనపర ఉత్సవానికి బంగారపేట ఎమ్మెల్యే నారాయణస్వామి, ముళబాగిలు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, కేజీఎఫ్ ఎమ్మెల్యే రూపకళలు గైర్హాజరయ్యారు. ఇదే విషయమై బుధవారం ఎమ్మెల్యే రూపకళ మాట్లాడుతూ జనపర ఉత్సవానికి తమకు ఆహ్వానం అందలేదన్నారు. అవసరమైనవారికి ఆహ్వానించి రప్పించుకున్నారన్నారు. ప్రభుత్వం మాదే అయితే ఏం ప్రయోజనమని, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రే కాదు జిల్లా అధికారి కూడా అలాగే వ్యవహరిస్తున్నారన్నారని మండిపడ్డారు. నేరుగా మంత్రి బైరతి సురేశ్ తీరును తప్పుబట్టారు. ఇప్పటికే దేవుడు ఆశీర్వదించారని, ఇక మమ్మల్ని ఎవరూ ఏం చేయలేరన్నారు. బడ్జెట్ నిర్ణయాలలోనూ తమ విశ్వాసం తీసుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. రాజకీయంగా మాట్లాడడం లేదని కానీ డీసీసీ బ్యాంకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రూపు విభేదాలను కొందరు ప్రోత్సహిస్తున్నారన్నారు. కోచిముల్, డీసీసీ బ్యాంకులను నాశనం చేశారన్నారు. రైతుల విషయంలో ఎవరూ స్పందించరని, మూడేళ్లుగా పాడిరైతుల సమస్యలను ప్రశ్నించేవారు లేరన్నారు. కోలారు జిల్లాలో గ్రూపు విభేదాలు కొత్తవేమీకాకున్నా ఎన్నికలు ముగిశాక బహిరంగంగానే విమర్శలు చేయడం ఇదే ప్రథమం.



నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ దళితులకు కేటాయించిన గ్రాంట్లతో జనపర ఉత్సవం జరిగిందని, కానీ జిల్లాకు చెందిన ముగ్గురు దళిత ఎమ్మెల్యేలను కనీసంగా కూడా చర్చించలేదని, ఇది ఎమ్మెల్యేలకు జరిగిన అవమానం కాదని జిల్లా ఎస్సీ, ఎస్టీ సముదాయానికి జరిగిన అన్యాయమన్నారు. మంత్రి శ్రీమంతుడే కావచ్చునని ఆయనకు పలుకుబడి ఉండవచ్చునని అంతమాత్రాన ఎవరు రాకున్నా కార్యక్రమం జరుపుతానని సవాల్ చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. మంత్రి సలహాదారుల మాటలు వింటే పరిస్థితి భిన్నంగా ఉంటుందన్నారు.

ఓపీఎస్ పరిశీలనకు ప్రత్యేక కమిటీ

● ఉద్యోగుల వినతికి సీఎం సానుకూల స్పందన

బెంగళూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలు చేసే అంశంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య సానుకూలంగా స్పందించారు. బుధవారం ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో గెలుపొందిన డైరెక్టర్‌లు, పదాధికారుల సమావేశాన్ని ఉద్దేశించి సీఎం వర్చువల్ రూపంలో మాట్లాడారు. కొత్త సంఘం సభ్యులతోపాటు ఉద్యోగులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. న్యూ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) తొలగించి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) అమలు చేయాలనే ప్రతిపాదనపై కమిటీ నివేదిక పరిశీలించి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కోటి రూపాయల దాకా రుణసాయంపై త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 2006 ఏప్రిల్ తర్వాత నియమితులైనవారికి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నగదు రహిత జ్యోతి సంజీవిని అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు.

నాటుబాంబుల స్వాధీనం

● పొలాల్లో వన్యప్రాణులపై ప్రయోగానికి సిద్ధం
● చామరాజనగర జిల్లాలో ఇద్దరి అరెస్టు

బెంగళూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సరిహద్దు జిల్లా చామరాజనగర అటవీప్రాంతంలో నాటుబాంబుల తయారీ కలకలం రేపుతోంది. అటవీప్రాంతాలకు అనుబంధంగా రైతులు పంటలసాగు చేయడం సవాల్‌గా మారుతోంది. ఓవైపు ఏనుగులు, మరోవైపు అడవిపందుల దాడి పెరుగుతోంది. ఇలా పంటలు నాశనం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని పలుమార్లు రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ప్రాంతంలో కొందరు నాటుబాంబులు తయారు చేసి పంట పొలాల్లో ఉంచుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. రెండురోజులక్రిందట మేతకు వెళ్లిన ఆవులకు నాటుబాంబు పేలడంతో నోరు దెబ్బతింది. ఆవులనోళ్లు తెగిపోవడంతో పెంపకందారులు పరిశీలించగా నాటుబాంబులుగా తేలింది. పోలీసులు నాటుబాంబుల తయారీని సీరియస్‌గా తీసుకున్నారు. కునగళ్ళి గ్రామంలో రామశెట్టి, సోమణ్ణలు హనూరు ప్రాంతంలోని పలువురు రైతులకు నాటుబాంబులు సరఫరా చేసినట్లు గుర్తించారు. వారి నుంచి పది నాటుబాంబులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో ఐదు ఆవులు నాటుబాంబుల కారణంగా గాయపడినట్లు పోలీసులు నిర్ధారించారు. నాటుబాంబుల తయారీని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని భవిష్యత్తులో గొడవలు, ఇతరత్రా కారణాలకు బాంబులు వాడితే పెను ప్రమాదం జరగనుందని పోలీసులు సీరియస్‌గా భావిస్తున్నారు. వన్యప్రాణులను బాంబులతో దాడి చేయడం కూడా నేరమేనని పోలీసులు హెచ్చరించారు.

తుదిశ్వాస వరకు హిందువునే..

● కాంగ్రెస్‌ను వీడను.. బీజేపీకి మద్దతు వదంతులే.. ● కుంభమేళా ఏర్పాట్లను ప్రశంసిస్తే తప్పేముంది?: డీసీఎం డీకే

బెంగళూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): 'నేను పుట్టుకతో హిందువును, కాంగ్రెస్ వాదిని, నా వ్యక్తిగతమైన నమ్మకాన్ని పాటిస్తానని కానీ బీజేపీతో సన్నిహితం అవుతున్నా' అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. సదాశివనగర్‌లోని నివాసం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీ వేణుగోపాల్ తననే కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగాలని సూచించారనే ప్రచారం అవాస్తవమన్నారు. ఇంకా ఎన్నో తప్పుడు ప్రచారం జరుగుతున్నాయన్నారు. ఇషా ఫౌండేషన్‌కు తన కుమార్తె వెళ్లేవారన్నారు. ఈ ఏడాది ఇషా ఫౌండేషన్ ముఖ్యులు సద్గురు జగ్గీ వాసుదేవ్ తమ ఇంటికి వచ్చి ఆహ్వానించారన్నారు. ఆయన మైసూరుకు చెందినవారని, ఆయన జ్ఞానం ప్రశంసనీయమన్నారు. అంతమాత్రాన బీజేపీతో వెళ్తాననేది తప్పుడు ప్రచారం అన్నారు. తాను హిందువునని అన్ని మతాలను గౌరవిస్తానన్నారు. కాంగ్రెస్ అందరినీ సమైక్యంగా భావిస్తుందన్నారు. మహాత్మాగాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ సమైక్యవిధానం పాటించారన్నారు. సోనియాగాంధీ ఉగాది పండుగ చేయడం చూశానన్నారు. ఆమె మనకంటే ఎక్కువ భారతీయతను పాటిస్తారన్నారు. అటువంటి వారి నాయకత్వంలో ఉన్నానన్నారు. తమ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అంటే శివుడి పేరు అన్నారు. ఆయన పేరు మార్చుకున్నారా..? అంటూ ప్రశ్నించారు. హిందువుగా పుట్టానని, హిందువుగానే తుదిశ్వాస వీడుతానన్నారు. మహాకుంభమేళాలో పాల్గొనడం, ఇషా ఫౌండేషన్‌లో శివరాత్రి వేడుకలకు వెళ్లడం వల్ల ఇలాంటి ప్రచారం సాగుతోందన్నారు. జైన, సిక్కు మతాలకు వెళ్లానని, దర్గా, చర్చ్‌లకు వెళ్లానన్నారు. మహాకుంభమేళాలో నా అనుభవం బాగుందని, అక్కడి ఏర్పాట్లను స్వాగతిస్తానన్నారు. ఇదో సాధారణ విషయం కాదని, అంత భారీస్థాయిలో ప్రజలను పర్యవేక్షించడం అనేది సామాన్యమైనది కాదన్నారు. ఒకటిరెండు తప్పులను ప్రస్తావించేది లేదన్నారు. మతంలో భక్తుడు, భగవంతుడిమధ్య, సంబంధం ఉంటుందని, కొందరు దేవుడితో నేరుగా వ్యవహరిస్తే మరికొందరు అర్చకుల ద్వారా పూజలు జరుపుతారన్నారు. శశిథరూర్ బీజేపీవైపు మొగ్గు చూపుతున్న తరుణంలోనే మీ అడుగులు అటువైపా అనే ప్రశ్నకు స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేష్ఠమైనదని, ఓ గొప్ప చరిత్ర ఉందన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యపై స్పందిస్తూ గతంలో స్టీల్ బ్రిడ్జ్‌ను వ్యతిరేకించినట్లే సొరంగ మార్గాన్ని విమర్శిస్తున్నారన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామిది కేవలం రాజకీయమని, కెంపేగౌడ పేరు నాశనం చేసేందుకు వెళ్లారన్నారు. ఆయన సీఎంగా ఏం చేశారనేది తెలుసుకోవాలన్నారు. పారిశ్రామికవేత్త మోహన్‌దాస్‌పై రాజకీయాల్లో ప్రవేశించాలన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం తనకు దేవాలయం అన్నారు. సమష్టి నాయకత్వంలోనే ముందుకు వెళ్తామన్నారు. బోర్డులు, కార్పొరేషన్లలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మీడియాముందు మంత్రి రాజణ్ణ వ్యాఖ్యలకు సమాధానం చెప్పేది లేదంటూ దాటవేశారు.



మీడియాతో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్


నగరేశ్వరి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


కోట మల్లేశ్వరుడి దర్శనానికి వేచి ఉన్న భక్తులు


మజ్జిగ పంపిణీ చేస్తున్నశివభక్తుడు మురుగన్


సప్తాహ భజన..

హర హర.. మహాదేవ..

● ఉభయ జిల్లాల్లో మార్మోగిన శివనామం ● శివరాత్రి సందర్భంగా ఆలయాలు కిటకిట


అలంకరణలో కోట మల్లేశ్వరస్వామి


కాశీ విశ్వనాథుడు


కోటె పంపావతి


కేరేకుప్ప శివుడు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఉభయ జిల్లాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. బుధవారం ఉదయం నుంచే భక్తులు పరమశివుడికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రోజంతా ఉపవాసం ఉన్న భక్తులు రాత్రంతా సాంస్కృతిక కార్యక్రమాలతో జాగరణ చేశారు. స్థానిక కోట మల్లేశ్వర దేవస్థానం, నీలకంఠేశ్వర దేవస్థానం, చిన్నమార్కెట్ మల్లికార్జున ఆలయం, బెంగళూరులోని నగరేశ్వర ఆలయంలో , సత్యనారాయణ పేటలోని కాశీవిశ్వనాథుని దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. .

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వర నగర్‌లో వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాలుకాలోని హగరి, వీడీ హళ్లి, మోకా, రూపనగుడి తదితర ప్రాంతాల్లో మహాశివరాత్రి పండుగ సందర్భంగా శివాలయాలతో పాటు వివిధ ఆలయాల్లో శివరాత్రి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రిని పురస్కరించుకుని తాలుకాలోని అన్ని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఉపవాసం చేశారు. నాగలింగేశ్వరాలయం, ఉమా మహేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయంలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం పోటెత్తారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

కంప్లి (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంప్లి పట్టణం పక్కనే వున్న తుంగభద్ర నదిలో స్నానాలు చేపట్టి పక్కనే వున్న పంపాపతి, పార్వతి దేవిలకు పూజలు చేపట్టారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలోని ముక్తి నాథేశ్వరాలయంలో భక్తాదులు పోటెత్తి పూజలు చేపట్టుకున్నారు. పేట బసవేశ్వరాలయం వద్ద కళ్యాణచౌకి మఠ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తాదులకు బిల్వపత్రం, గోమాత పంచామృతం పంపిణీ చేశారు.


విద్యుత్ అలంకరణలో బాదనట్టి ఆలయం


తోరణగల్లు (ఆంధ్ర జ్యోతి): తాలుకా వ్యాప్తంగా శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కురేకుప్ప పట్టణంలోని మార్కండేయ దేవస్థానం, పంపాపతి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సిరుగుప్పలో పరమశివుడి ఊరేగింపు


కల్యాణి చౌకిన మఠం ఆధ్వర్యంలో బిల్వపత్రం, గోపంచకం పంపిణీ


మార్కండేయ ఆలయంలో..


కంప్లిలో..



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1608.34	1,587.14
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,104	763
నీటి నిల్వ (టీఎంసీలు)	34.42	8.80

3న కేకేఆర్‌టీసీ ఫోన్ ఇన్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కళ్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ(కేకేఆర్‌టీసీ) హొస్పేట్ డివిజన్ మార్చి 3న సరైన బస్సు సేవకు సంబంధించి ఫోన్-ఇన్ కార్యక్రమాన్నినిర్వహిస్తోందని హొసపేట డివిజన్ కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేది మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4-30గంటల వరకు ప్రజా రవాణాలో తలెత్తే సమస్యలపై ప్రయాణికులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే 77609 92314, 776099 2317 నెంబర్లకు కాల్ చేయాలని తెలిపారు.

హంపి ఉత్సవాలకు సర్వం సిద్ధం

హొస్పేట (విజయనగరం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : హంపి ఉత్సవ్ 2025 వేడుకలకు తుది సన్నాహాలు పూర్తయ్యాయి. గాయత్రి పీఠ మైదానంలో నిర్మించిన ప్రధాన వేదిక విజయనగర సామ్రాజ్య నిర్మాణ వైభవాన్ని ప్రతిబింబిస్తోంది. హోయసలు, చోళులతో సహా అనేక ఇతర గొప్ప సామ్రాజ్యాల వాస్తుశిల్పులతో పాటు ఇస్లామిక్ నిర్మాణ శైలిలను ప్రతిబింబేంచేలా వేదికను నిర్మించారు. ఈ సారి ప్రధాన వేదికకు మాజీ ఉప ముఖ్యమంత్రి దౌత్యవేత్త ఎంపీ ప్రకాష్ పేరు పెట్టారు. 120-80 అడుగుల విస్తీర్ణంలో వేదిక నిర్మించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఓపెన్ ఎయిర్ మ్యూజియంగా పిలువబడే హంపిలోని ప్రధాన స్మారక చిహ్నాల చిత్రాలను సందర్శకులు ఒక వేదికపై చూసి ఆనందించవచ్చు. వేదిక మధ్యలో హజారామ్ విజయ విఠల ఆలయం వుంది. దానిపై ప్రపంచ ప్రఖ్యాత కమల్ మహల్ ప్రతిరూపాలు నిర్మించబడ్డాయి. దానిలోపల ఏడు టోన్ల స్తంభాలు, చెక్కబడిన సింహ విగ్రహాలు ఉన్నాయి. ఇవి హంపి ప్రత్యేకమైన నిర్మాణం. దీనితో పాటు అందమైన ఇస్లామిక్ శైలి విండో నిర్మాణాన్ని కూడా చూడవచ్చు. వేదిక కుడి వైపున హేమకూటలోని సూర్యాస్తమయ వీక్షణ ప్రదేశంలో రాతి మండపం ప్రతిరూపంపై నిర్మించిన అంజనాద్రి హనుమంతుని విగ్రహం వుంది. ఎడమ వైపున ఆవాలు గింజల గణేశ విగ్రహం వుంది. బలిపీఠం రెండు వైపులా రాతి రథం ప్రతిరూపం, విజయనగర సామ్రాజ్యం వరాహ చిహ్నం, హంపి ఉత్సవం 2025 చిహ్నం ఉన్నాయి. బుధవారం ఎంపీ ప్రకాష్, కలెక్టర్, అధికారులు వేదికను పరిశీలించారు.


ప్రధాన వేదిక వద్ద ఎంపీ ప్రకాష్, అధికారులు


తుంగా హారతిలో మంత్రి జమీర్, ఎమ్మెల్యే గవియప్ప

హోసూరు జోన్


కేక్ కట్ చేస్తున్న జయలలిత అభిమానులు

ఘనంగా జయలలిత జయంతి

హోసూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రానికి ఆరుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన అఖిల భారత అన్నా ద్రావిడ మున్నేట్ర కళగం (ఏఐఏడీఎంకే) జయలలిత జయంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. 77వ జయంతి సందర్భంగా బుధవారం ఏ చెట్టిపల్లిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్థానికులకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రిగా ఆమె చేసిన సాధనలను వక్తలు ప్రస్తావించారు. సామాన్యులకు సైతం ఎన్నో సంక్షేమాలు కల్పించారని అవి నేటికీ కొనసాగుతున్నాయన్నారు. విప్లనాయకురాలిగా, అమ్మగా అభిమానుల హృదయాల్లో ఉన్నారన్నారు. కాగా బేరికై పంచాయతీ, ఎ. చెట్టిపల్లి పంచాయతీ, శూలగిరి వెస్ట్ యూనియన్ తరపున యూనియన్ కార్యదర్శి వెంకటాచలం అలియాస్ బాబు వారి ఆధ్వర్యంలో జయలలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ సెక్రటరీ అప్పయ్య, యూనియన్ కోశాధికారి నారాయణప్ప, మాజీ యూనియన్ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు బాబు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


దుకాణాల్లో మిఠాయిల పంపిణీ


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

పథకాల అమలుపై కలెక్టర్ సమీక్ష

హోసూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు సర్కిల్ పరిధిలోని కెలవరపల్లి పంచాయతీ, శ్రీలంక తమిళుల పునరావాస శిబిరం, పెద్దకొలు, పునగస్‌దొడ్డి, అలసనత్తం, శ్రీలంక తమిళుల పునరావాస శిబిరాలు, చౌక దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నివాస గృహాల నిర్మాణ పనులు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. బుధవారం కలెక్టర్ దినేశ్‌కుమార్ నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పథకాల అమలుకు సంబంధించి మీ ఊరిలో మిమ్మల్ని వెతుక్కొంటూ అనే పథకం క్రింద క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారని ప్రస్తావించారు. సెన్నసంద్రం ఎలిమెంటరీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ, హోసూరు సర్కిల్, కెలవరపల్లి పంచాయతీలోని చౌక దుకాణాలను తనిఖీ చేశారు. బియ్యం, పప్పులు, పంచదార, వంటనూనె నిల్వలను పరిశీలించారు. కెవలరపల్లి అనకట్ట ప్రాంతంల్లోని శ్రీలంక తమిళుల పునరావాస శిబిరంలో తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు సదుపాయం పరిశీలించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, డైరెక్టర్ కవిత, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక, ప్రోగ్రామ్ డైరెక్టర్ పెరియస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధికి కృషి

● కేకేఆర్‌డీబీ అధ్యక్షుడు అజయ్ సింగ్

రాయచూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వెనక బడిన కల్యాణ కర్ణాటక ప్రాంతం సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిబద్దతతో పని చేస్తున్నట్లు కేకేఆర్‌డీబీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అజయ్ సింగ్ తెలిపారు. బుధవారం రాయచూరు జిల్లా కేంద్రంలో విలేఖరులతో మాట్లాడిన ఆయన ఈ ఏడాది కేకేఆర్‌డీబీకి కేటాయించిన రూ.5వేల కోట్లను పూర్తి స్థాయిలో ఖర్చు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆరోగ్య రంగం మరింత పటిష్టంగా పని చేసేందుకు రూ.440 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపిన అజయ్ సింగ్ ఇందుకు సంబంధించి టెండర్లు ఇప్పటికే 80 శాతం పనులకు ఖరారైయ్యాయని త్వరలోనే పూర్తి స్థాయి పనులు చేపడుతామన్నారు. 25 శాతం నిధులతో కేకేఆర్‌డీబీ నిధుల్లో 25 శాతం నిధులను విద్య రంగానికి కేటాయించినట్లు తెలిపిన అజయ్ సింగ్ కొత్త తాలూకల్లో మిని విధాన సౌధాలు నార్మాణం కోసం రూ.8.6కోట్లను కేటాయించామన్నారు. కాగా కల్యాణ కర్ణాటక పరిధిలోని అన్ని నియోజక వర్గాల్లో కల్యాణ రహదారి పేరుతో ప్రతి నియోజక వర్గంలో 30కిలో మీటర్లను అభివృద్ది చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.1000 కోట్లు కేటాయించామన్నారు పనులను మార్చి 8న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గెల ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్థానం ఖాళీగా లేదని ప్రస్తుతం పని చేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో తమ ప్రభుత్వం ఐదేళ్ల పాటు స్థిరంగా కొనసాగుతుందని కేకేఆర్‌డీబీ అధ్యక్షుడు అజయ్ సింగ్ చెప్పారు. ముఖ్యమంత్రి మార్పు జరుగుతుందంటు వస్తున్న వార్తలు కేవలం ఊహాజనితాలన్నారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

● 5,034 యూనిట్ల సేకరణతో రికార్డు సాధించాం: కలెక్టర్


కలెక్టర్ మిశ్రా

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సండూరులోని తోరణగల్లు సమీపంలోని జిందాల్ ఫ్యాక్టరీలో చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన కలెక్టర్ మెగా శిబిరంలో మొత్తం 5,034 యూనిట్ల రక్తాన్ని సేకరించి రికార్డు సృష్టించామన్నారు. రక్తదాతలకు, సహకరించిన యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నిర్వహణ విభాగం, జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ మద్దతుతో లక్ష్యం పూర్తి చేశామన్నారు. కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, జిల్లా క్షయ నిర్మూలన అధికారి డా.ఇంద్రాణి, వారి బృందం, 20మంది వైద్యులు, 200 మంది నిపుణులతో లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేసిన 9బ్లడ్ బ్యాంకులను అభినందించారు.

చక్కెర కర్మాగారం ఏర్పాటు చేయాలని వినతి


ఎమ్మెల్యే గవియప్పకు వినతిపత్రం అందజేస్తున్న సిటిజన్స్ ఫోరం సభ్యులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హొసపేట తాలూకాలో చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం సిటిజన్స్ ఫోరం , వినాయక నగర వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ బుధవారం ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్పకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు యమునేష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శంకరగౌడ రైతు సంఘం అధ్యక్షుడిగా ఉన్నంత కాలం ఎన్నిఅడ్డంకులు ఎదురైనా ఇక్కడి ఐఎస్ఆర్ చక్కెర కర్మాగారం మూతపడలేదు. సుమారు 10 సంవత్సరాల తర్వాత ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరిగిందన్నారు. స్థానికంగా చక్కెర కర్మాగారం ఉంటేనే చెరకు రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా సంస్థ నాయకులు కే.అంజినప్ప, అంజనేయులు, బి.రామకృష్ణ, విశ్వనాథ్, విరూపాక్షప్ప, నజీర్‌సాబ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సముదాయ భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న సంఘం నాయకులు

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్ర జ్యోతి) : తాలుకాలోని పరమందేవనహళ్లి గ్రామంలో బుధవారం వాల్మీకి సముదాయ భవనాన్ని గ్రామ ప్రముఖులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భవనం ప్రారంభించినట్లు వాల్మీకి నాయకులు తెలిపారు. పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీ శివరాజ్ రిటైర్డ్ ఏఎస్ఐ వన్నూరప్ప, వాల్మీకి జిల్లా మాజీ అధ్యక్షుడు జనార్ధన్ నాయక్, గ్రామ పంచాయతీ సభ్యులు అంగడి లింగన్న, బ్రహ్మానందం వన్నూరప్ప, గ్రామ పంచాయతీ సెక్రెటరీ తిప్పేరుద్ర తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

● వారిని నిత్యం స్మరించుకోవాలి: అక్కి మల్లికార్జున


కార్యక్రమంలో మాట్లాడుతున్న అక్కి మల్లికార్జున

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని, వారిని నిత్యం స్మరించుకోవాలని దాత అక్కి మల్లికార్జున అన్నారు. బళ్లారి నగరంలోని రాష్ట్రీయ బసవ దళ్‌లో కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా యూనిట్ బుధవారం కొత్త విరాళ స్వీకరణ ,విరాళ ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో మల్లికార్జున మాట్లాడుతూ.. పిల్లలకు మంచి మర్యాదలు నేర్పినప్పుడు ఆ పిల్లలు సమాజానికి వెలుగు దీపాలుగా మారతారన్నారు. ప్రఖ్యాత వైద్యుడు డాక్టర్ శివశంకరప్ప ముడే గౌడ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కన్నడ సాహిత్య పరిషత్ అనేక మానవ విలువలను ప్రోత్సహిస్తోందన్నారు. ఈధార్మిక విరాళాల ప్రాజెక్ట్ చాలా ముఖ్యమైనది, కౌన్సిల్ అనేక తరాల వారు గుర్తుండిపోయేలా పని చేయడం హర్షణీయమన్నారు. తదుపరి శ్రీమతి భాగ్యలక్ష్మి అక్కమహాదేవి వచనాలతో సామాజిక ఆలోచనపై ఉపన్యాసం ఇచ్చారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లాధ్యక్షుడు నిష్టిరుద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక విరాళాలు సేకరించే ఘనత బళ్లారి జిల్లాకు ఉందని, అదేవిధంగా విరాళాలు ఇచ్చే వారు విరాళాలు ఇచ్చి మండలిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. ఈసందర్భంగా కేణ బసప్ప, బసవరాజ్, రవిశంకర్, నాగరాజ్, పద్మజ, దమయంతి, గౌడ, తిమ్మప్ప, నాగారెడ్డి, కార్తీక్ మరిస్వామి, ఉపాధ్యాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా ఉడుసులమ్మ కుంభోత్సవం


ఊరేగింపులో భక్తులు


అలంకరణలో అమ్మవారు

కంప్లి, ఫిబ్రవరి 26(ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలోని బాదనట్టి గ్రామంలో గ్రామదేవత ఉడుసులమ్మ కుంభోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. యేటా శివరాత్రి నాడు కుంభోత్సవాన్ని వైభవంగా జరుపుకుంటామని గ్రామస్థులు తెలిపారు. ఉడుసులమ్మకు పూజలు చేయడం వల్ల తాము సమృద్ధిగా పంటలు పండిస్తూ ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు.

స్వచ్ఛతకు ముందుకొచ్చిన మఠాధీశులు

కంప్లి, ఫిబ్రవరి 26(ఆంధ్ర జ్యోతి): విజయనగర జిల్లాలో కొట్టూరేశ్వర రథోత్సవం సందర్భంగా కొట్టూరుకు వచ్చే మార్గంలో యాత్రికులు విసిరేసిన ప్లేట్లు, గ్లాసులు ఇతర సామగ్రిని పరిశుభ్రం చేసేందుకు నందీపుర మఠ స్వాములు మహేశ్వర స్వాములు, పురసభ అధికారి రేణుకలు ముందుకొచ్చి రోడ్డుపక్కన వున్న చెత్తాచెదారాన్ని పరిశుభ్రం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా నందీపుర మహేశ్వర స్వాములు మాట్లాడుతూ పరిశుభ్రం చేయడానికి విద్యార్థులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయం ఇలా ధార్మిక కార్యక్రమాలు చేయడం వల్ల విద్యార్థులు గుర్తింపు పొందుతారు.


స్వచ్చత కార్యక్రమంలో నందీపుర మఠాధీశులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కాన్‌స్టాంటైన్ ది గ్రేట్ (జయంతి)



రోమన్ చక్రవర్తి కాన్‌స్టాంటైన్ 272 ఫిబ్రవరి 27న సెర్బియా దేశంలో జన్మించారు. రోమన్ సామ్రాజ్యాన్ని 306 నుంచి 337 వరకు పాలించినట్టు చరిత్ర కథనం. తండ్రి మరణానంతరం అనూహ్యంగా పాలనా పగ్గాలు చేపట్టారు. పాలన, ఆర్థిక, సామాజిక అంశాలతోపాటు మిలిటరీ విధానం లోనూ పలు సంస్కరణలు చేసి మంచి పేరొందారు. ఆయన ప్రవేశపెట్టిన బంగారు నాణెం వెయ్యి సంవత్సరాలకుపైగా బైజంటైన్, యూరోపియన్ కరెన్సీగా చలామణి కావడం విశేషం. 337 మే 22న కన్నుమూశారు.

ఎలిజబెత్ టేలర్ (జయంతి)



డేమ్ ఎలిజబెత్ రోజ్‌మండ్ టేలర్ 1932 ఫిబ్రవరి 27న లండన్ దేశంలో జన్మించారు. క్లాజికల్ హాలీవుడ్ సినిమాలో 1950 దశకంలో ఇంగ్లిష్-అమెరికన్ నటిగా ఎంతో పేరొందారు. 1963 లో ప్రత్యేకించి చారిత్రాత్మక 'క్లియోపాత్ర' సినిమా బాక్సాఫీస్ హిట్‌గా ఎంతో గుర్తింపు తెచ్చింది. అప్పట్లోనే ఒక మిలియన్ డాలర్ రెమ్యూనరేషన్ పొందిన తొలి నటి కావడం విశేషం. అకాడమీ అవార్డు, గోల్డెన్ గ్లోబ్ అవార్డులు, ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు. 1999లో అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ గ్రేటెస్ట్ 7వ ఫిమేల్ స్క్రీన్ లెజెండ్‌గా ప్రకటించింది. ఆమె పలు సామాజిక సేవలందించారు. 2011 మార్చి 23న కన్నుమూశారు.

నానాజీ దేశ్‌ముఖ్ (వర్ధంతి)



నానాజీ దేశ్‌ముఖ్ 1916 అక్టోబరు 11న మహారాష్ట్ర రాష్ట్రం వషిమ్ జిల్లాలోని కడోజీ గ్రామంలో జన్మించారు. అసలు పేరు చండికా దాస్ అమృత రావు దేశ్‌ముఖ్. సామాజిక ఉద్యమకారుడు. విద్య, ఆరోగ్యం, గ్రామీణ స్వావలంబన రంగాలలో ఎంతో కృషి చేశారు. తొలి గ్రామీణ యూనివర్సిటీ చిత్రకూట్ గ్రామోదయ్ విశ్వ విద్యాలయను ఏర్పాటు చేసి చాన్సలర్‌గా వ్యవహరించారు. భారతీయ జనసంఘ్ ద్వారా లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగాను వ్యవహరించారు. 1947లో ఆర్ఎస్ఎస్ రాష్ట్రధర్మ, పాంచజన్య అనే రెండు జర్నల్స్‌ను, స్వదేశ్ పత్రికల ఏర్పాటుకు సిద్ధం కాగా మాజీ ప్రధాని వాజ్‌పేయ్ సంపాదకులుగా, నానాజీ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 1999లో పద్మభూషణ్ అందుకున్నారు. 2010 ఫిబ్రవరి 27న కన్నుమూశారు. 2019 లో మరణానంతర 'భారతరత్న' ప్రకటించారు.

బీఎస్ యడియూరప్ప (పుట్టినరోజు)



దక్షిణాదిన భారతీయ జనతా పార్టీ అగ్రనేతలలో ఒకరైన బీఎస్ యడియూరప్ప 1943 ఫిబ్రవరి 27న మండ్య జిల్లా బూకనకెరె గ్రామంలో జన్మించారు. 1970లో శికారిపుర ఆర్ఎస్ఎస్ కార్యదర్శిగా, తర్వాత తాలూకా జనసంఘ్ అధ్యక్షుడిగా, 1975లో శికారిపుర పురపాలక సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. అనంతరం ఎమర్జెన్సీలో జైలు పాలయ్యారు. 1980లో బీజేపీ ఆవిర్భావంతో తాలూకా బీజేపీ అధ్యక్షుడిగా, తర్వాత శివమొగ్గ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అనతికాలంలోనే కర్ణాటక బీజేపీ అధ్యక్ష స్థాయికి ఎదిగారు. నాలుగురుసార్లు ముఖ్యమంత్రిగా, మూడుసార్లు శాసనసభ ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. 8సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు. మీడియాలో ఆయనను రాజాహులిగా వ్యవహరిస్తారు.



రజత కవచధారణలో భోగనందీశ్వరుడు



అరుణాచలేశ్వర స్వామికి అలంకరణ



బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో అలంకరణలో..



ఆవణి గ్రామంలో ఊరేగింపు



గంగాజలం బాటిళ్లు పంపిణీలో మాజీ మంత్రి

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

» భక్తులకు గంగాజలం పంపిణీ

» విశేష పూజలు, అలంకరణలు

ముళబాగిలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆవణి గ్రామంలో పురాణ ప్రసిద్ధ రామలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. తదుపరి ఉత్సవ మూర్తులను సంప్రదాయబద్ధంగా పురవీధులలో ఊరేగించారు. ఆలయ అర్చకులు రమణమూర్తి దీక్షిత్ నేతృత్వంలో పూజా కైంకర్యాలు కొనసాగాయి. ఉత్సవంలో ఉపతహశీల్దార్ హెచ్ నారాయణస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణి, గ్రామ పాలనాధికారులు వీరేశ్, ప్రసన్న, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

భోగనందీశ్వర ఆలయంలో విశేష పూజలు

చిక్కబళ్ళాపుర: మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన చిక్కబళ్ళాపురలోని పురాతన ఆలయాలలో బుధవారం విశేషపూజలు కొనసాగాయి. ప్రత్యేకించి నంది గ్రామంలోని భోగనందీశ్వరస్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం అనంతరం విశేష అలంకరణలు చేశారు. శేషపడగతో కూడిన రజత కవచధారణ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అతిపెద్ద సాలిగ్రామ లింగాలలో ఒకటిగా పేరుగాంచింది. రాజరాజచోళులు నిర్మించిన ఆలయంగా ఉంది. నలంద, కదంబ, గంగారస, విజయనగర శైలిలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ స్వామివారికి నిత్యం రుద్రాభిషేకం చేస్తారు. కాగా నంది కొండకు అనుబంధంగా ఉండే అరుణాచలేశ్వర ఆలయంలోనూ విశేషపూజలు కొనసాగాయి. కాగా పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోనూ వేడుకలు సాగాయి. కొండల నడుమ వెలసిన శివలింగం ఆకారాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలుచోట్ల జాగరణకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని ఆలయాలలోనూ భక్తుల సందడి నెలకొంది.

నంజుండేశ్వరస్వామి ఆలయంలో..

విజయనగర్: మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం శివాలయాలలో విశేష పూజలు కొనసాగాయి. విజయనగర్ నియోజకవర్గ పరిధిలోని 158వ వార్డు గీతాంజలినగర్‌లో కొలువైన నంజుండేశ్వరస్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప, గోవిందరాజనగర్ ఎమ్మెల్యే ప్రియాకృష్ణలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్థానికులు ఎమ్మెల్యేలను ఘనంగా స్వాగతించారు.



శిడ్లఘట్టలో అలంకరణ



విజయపురలోని చంద్రమౌళీశ్వరస్వామి

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పంచలింగాల దర్శనానికి భక్తులు ఆసక్తి చూపారు. కోటె సర్కిల్‌లోని సోమేశ్వర దేవస్థానం, అశోకరోడ్డులోని నగరేశ్వరస్వామి ఆలయం, అదే రోడ్డులోని కాశీ విశ్వనాథేశ్వర ఆలయం, అగ్రహారవీధిలోని శ్రీకంఠేశ్వర, ఏకాంబరేశ్వర దేవాలయం, చంద్రశేఖర స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. వీరాపురలోని గవిగంగాధరేశ్వరస్వామి, భూతాళ మలె మహదేశ్వర స్వామి ఆలయాల్లో రెండు రోజులపాటు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

విజయపురలో...

విజయపుర: విజయపురలోని చంద్రమౌళీశ్వరస్వామి నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకం, విశేష పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

భక్తులకు గంగాజలం పంపిణీ

మహదేవపుర: నియోజకవర్గంలోని కుందలహళ్ళి నాగలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తులకు ప్రయాగరాజ్ త్రివేణి సంగమం నుంచి తెప్పించిన గంగాజలాన్ని భక్తులకు పంపిణీ చేశారు. బీజేపీ కర్ణాటక రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్ సమకూర్చిన గంగాజలం బాటిళ్లను మాజీ మంత్రి అరవింద లింబావళి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీకే జయరాం తదితరులు పాల్గొన్నారు.

వైట్‌ఫీల్డ్‌లో...

వైట్‌ఫీల్డ్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో కొలువైన శివమల్లేశ్వర ఆలయంలో బుధవారం విశేషపూజల్లో ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రయాగరాజ్ నుంచి తెప్పించిన పవిత్రగంగాజలాన్ని భక్తులకు ప్రోక్షణ చేశారు. ప్రత్యేకపూజల్లో రూరల్ హోబళి బీజేపీ అధ్యక్షుడు హెచ్ఎస్ పిళ్ళప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర లింగార్చన

చింతామణి: పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డులోని సహనేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం సహస్ర లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు అభిషేకం, అనంతరం 12 గంటల మహామంగళారతి నిర్వహించారు. అర్చకుడు రవిశాస్త్రి బృందం హోమాదికాలు నిర్వహించిన అనంతరం సహస్రలింగార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకుని తాలూకాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేకించి జడలభైరవేశ్వర స్వామికి బుధవారం విశేషపూజల్లో ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, తులసి అభిషేకం సహా పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బిల్వపత్రం, ఇతరత్రా పూలతో భక్తులు వచ్చారు. పురసభ అధ్యక్షుడు శ్రీనివాస్, జడ్పీ మాజీ అధ్యక్షుడు కృష్ణప్ప, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏవీ పూజప్ప, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు కేఆర్ నరేంద్ర, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నంజుండప్ప, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ణి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట

బొమ్మనహళ్ళి: మహాశివరాత్రి పురస్కరించుకుని నియోజకవర్గంలోని శివాలయాలు భక్తుల ఓం నమః శివాయ నామఃస్మరణతో కిటకిటలాడాయి. సుద్దగుంటపాళ్యలోని మునీశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు సాగాయి. ఆలయ ధర్మకర్తలు కవిత, శ్రీనాథ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. హొంగసంద్ర పరిధిలోని బేగూరురోడ్డులోని మల్లికార్జునస్వామికి పంచామృతాభిషేకం, అలంకరణ చేశారు. కాగా అరికెరె పరిధిలోని శాంతినికేతన్ లే అవుట్ శాంతిధామలో కొలువైన మంజునాథస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా క్షీరాభిషేకం అవకాశం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ముఖేశ్ కుమార్‌వర్మ, కార్యదర్శి తాతయ్యగుప్త, మోహన్‌గుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్ గుప్త తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తుల రద్దీ నియంత్రణకు వలంటీర్లు సహకారం అందించారు. ఇలా పలు ఆలయాలలో విశేషపూజలు, ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి.



సహస్ర లింగార్చనలో అర్చకులు, భక్తులు



సహనేశ్వరస్వామి



శివమల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



శాంతిధామంలోని మంజునాథ స్వామికి క్షీరాభిషేకం



హొంగసంద్ర బేగూరు రోడ్డులోని మల్లికార్జునస్వామి



స్వామివారి ప్రసాదాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కృష్ణప్ప, ప్రియాకృష్ణ



సుద్దగుంటపాళ్య మునేశ్వరస్వామి

అగర్వాల్ కంటి ఆసుపత్రుల రాయబారిగా సచిన్



సచిన్ టెండూల్కర్

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అగర్వాల్ కంటి ఆసుపత్రుల ద్వారా సమాజంలో కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ రాయబారి అయ్యారు. ఇదే విషయాన్ని అగర్వాల్ కంటి ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ అమర్ అగర్వాల్ మంగళవారం బెంగళూరులో ప్రకటించారు. సచిన్ టెండూల్కర్ అగర్వాల్ కంటి ఆసుపత్రులకు రాయబారి కావడం సంతోషమన్నారు. రెండు దశాబ్దాలుగా సమాజంలో సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఏటా వందమందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు జరుపుతున్నట్టు తెలిపారు. రాయబారి కావాలనే అంశంపై సచిన్‌తో చర్చించినపుడు ఎంతో సంతోషంగా అంగీకరించారన్నారు.

ముగ్గురికి గాయాలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నానప్పగారిపల్లి ఆర్‌సీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. అమడగూరు మండలం గుండువారిపల్లి గ్రామానికి చెందిన ఉమేష్, చీకిరేవులపల్లికి చెందిన రుబేష్, అమడగూరుకు చెందిన రవితేజ ద్విచక్రవాహనంలో కదిరి నుంచి గుండివారిపల్లి గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో ఆ వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఆ ముగ్గురూ గాయపడ్డారు. వారికి ఓడీసీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు నిర్వహించి... కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పతంజలి ఆధ్వర్యంలో యోగా శిబిరం

చింతామణి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఆర్ లే అవుట్ నారెప్పకుంటలోని పతంజలి యోగశిక్షణా సమితి ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆజాద్‌చౌక్‌లోని హరిహరేశ్వర ఆలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక యోగా శిబిరం నిర్వహించారు. యోగాభ్యాసకులు పెద్దసంఖ్యలో పాల్గొని శివ నమస్కారాలు చేశారు. యోగా గురువులు నారాయణప్ప, గీతా, అశ్వథ్, రమేశ్, రాజశేఖర్ యాగంటి, లక్ష్మీ, ప్రభావతి తదితరులు ఓంకార నాదం చేశారు. గణపతి నమస్కారం, శివనమస్కారం, సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం యోగాగురు నారాయణప్ప మాట్లాడుతూ శివ నమస్కారాలలో 33 నమస్కారాలు ఉంటాయని ఇవి ముక్కోటి దేవతలకు సమర్పించేవిగా ఉంటాయన్నారు. వీటిలో 21సార్లు నుదుటిని భూమికి తాకించడం ద్వారా 21 దోషాలు, 9సార్లు శరీరం భూమిని తాకడంతో నవగ్రహ దోషాలు తొలగుతాయనే విశ్వాసం ఉందన్నారు. మూడుసార్లు త్రిమూర్తులకు నమస్కారం చేయడం, శివ నమస్కారాలతో 21 దోషాలు తొలగుతాయని భావిస్తారన్నారు. ఆలయ ట్రస్టు సభ్యుడు వాణి రాఘవేంద్ర ప్రసంగిస్తూ శివరాత్రి మహిమను, శివ నమస్కారాల ప్రత్యేకతను వివరించారు. ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు సాయి నాథ బాబు, చంద్రణ్ణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



హరిహరేశ్వర ఆలయంలో యోగాభ్యాసం

కరవే ఆధ్వర్యంలో దివిటీల ర్యాలీ

బాగేపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బెళగావిలో ఎంఈఎస్ కార్యకర్తలు కేఎస్ఆర్టీసీ కండక్టర్‌పై దాడి చేయడాన్ని ఖండిస్తూ పట్టణంలోని కర్ణాటక రక్షణా వేదిక (కరవే) కార్యకర్తలు మంగళవారం రాత్రి దివిటీలతో ర్యాలీ నిర్వహించారు. గూళూరు సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. కరవే హరీశ్ మాట్లాడుతూ ఎంఈఎస్ కార్యకర్తలు తమ తీరు మార్చుకోవాలని సూచించారు. కర్ణాటకలో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వ నియమాలు పాటించకుంటే ఎలాగన్నారు. భాషాభిమానం పేరుతూ దూకుడుగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర నేల, జల అంశాలలో కన్నడసంఘాలు ఒక్కటిగా ఉండాలన్నారు. ఇకనైనా ఎంఈఎస్ కార్యకర్తలు తమ తీరు మార్చుకుంటారని అభిప్రాయపడ్డారు. శాంతిగా ఉన్న తమను రెచ్చగొట్టేలా వ్యవహరించవద్దని సూచించారు. నిరసన ర్యాలీలో ఈ సందర్భంగా కరవే జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మ, ప్రధాన కార్యదర్శి రియాజ్, ఉపాధ్య క్షుడు అలీమ్, ఆటో విభాగం జబీవుల్లా, సంపత్‌కుమార్, పెద్దసంఖ్యలో కన్నడ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



దివిటీలతో ర్యాలీ చేస్తున్న కార్యకర్తలు

'ముడా' కేసుతో ఎలాంటి సంబంధం లేదు

●ఎంపీ కుమార్ నాయక్



రాయచూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) పరిధిలో జరిగిన అవకతవకల విషయంతో తనకు ఎలాంటి సంబంధం లేదని పూర్వపు మైసూరు జిల్లాధికారి ప్రస్తుతం రాయచూరు ఎంపీగా ఉన్న జీ కుమార్ నాయక్ స్పష్టం చేశారు. బుధవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన కుమార్ నాయక్, ముడా అవినీతి వ్యవహారానికి సంబంధించి లోకాయుక్త నుంచి తనకు ఎలాంటి సమాచారం గాని నోటీస్‌గాని అందలేదన్నారు. కాగా ఈ కేసు జరిగిన సందర్భంలో తాను మైసూరు జిల్లాధికారిగా పని చేయలేదని అప్పటికే తానింకా బెళగావిలో జడ్పీ సీఈఓగానే విధులు నిర్వహిస్తున్నట్లు కుమార్ నాయక్ వివరించారు. అదే సమయంలో ముడా వ్యవహారంలో డీనోటిఫికేషన్ పూర్తి నిబంధనల మేరకే సాగిందంటు పలు ఉదామరణలను నిబంధనలను కుమార్ నాయక్ వివరించారు. డీనోటిఫికేషన్ వ్యవహారంలో అవినీతి జరిగిందని నిబంధనల ఉల్లంఘన సాగిందని వస్తున్న వార్తలను ఖండించిన కుమార్ నాయక్ తాను మైసూరు జిల్లాధికారిగా పని చేసిన సమయంలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని డీనోటిఫికేషన్ పూర్తి పారదర్శకంగానే నిబంధనల మేరకే నిర్వహించామని ఇందులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదని తేల్చి చెప్పారు. తనను రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు కోరడం హాస్యాస్పదమని ఎంపీ అన్నారు. 2004లో జరిగిన వ్యవహారానికి సంబంధించి 2025లో రచ్చ చేస్తున్న నాయకులు ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తనను రాజీనామా చేయాలని కోరడం విడ్డూరమన్నారు. నమ్మకంతో ఎన్నుకున్న ప్రజలకు తాను ద్రోహం చేయనని తాను రాజీనామా చేసే ప్రసక్తే ఉండదన్నారు. తాను అసలు తప్పే చేయనప్పుడు రాజీనామా ప్రసక్తే ఉండదని ఎంపీ పేర్కొన్నారు.